శిథిలావస్థలో విశ్రాంతి భవనం

- మండల కేంద్రానికి వచ్చిన అతిథులకు ఆశ్రయం కరువు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నెల్లికుదురు: మండల కేంద్రంలో అప్పుడెప్పుడో 50ఏళ్ల క్రితం నిర్మించిన విశ్రాంతి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని మండల కేంద్రానికి వచ్చే అతిథులకు, ప్రతి పక్షాల సమావేశాల వినియోగానికి పనికి రాకుండా పోయింది. నాటి ఎంపీపీ అనుమాండ్ల రామనర్సమ్మ అధ్యక్షతన ఉమ్మడి సహకార శాఖ మంత్రి నెమరుగొమ్ముల యతిరాజారావు చేత 1988లో విశ్రాంతి భవనాన్ని పునర్ నిర్మించి ప్రారంభించారు. సుమారు 40ఏళ్లు ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల ప్రజలకు సేవలను అందించింది. ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అత్యవసరంగా ప్రజాప్రతినిధులో, అధికారులో బస చేయాలంటే వీలు లేకుండా విశ్రాంతి భవనం తయారైంది. అయినప్పటికీ శిథిలావస్థకు చేరుకుని 5ఏళ్లు గడుస్తున్న పాలక ప్రభుత్వాలకు చీమకుట్టినట్లైన లేదని మండల ప్రజలు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశ్రాంతి భవనం కోతులు, కుక్కలకు అడ్డాగా మారిందని, ఇప్పటికైన పాలకులు కళ్లు తెరచి శిథిలావస్థకు చేరుకున్న విశ్రాంతి భవనం కూలగొట్టి నూతన భవనాన్ని నిర్మాంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న విశ్రాంతి భవనం


పెచ్చులూడుతున్న భవనం గోడలు

నూతన విశ్రాంతి భవనం నిర్మించాలి



మాకు తెలియని కాలంలో నిర్మించిన విశ్రాంతి భవనం ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా కేంద్రాల్లో వందల కోట్లు పెట్టి నూతన భవనాలను నిర్మిస్తారు.. కానీ మండల కేంద్రాలపై పాలకులకు ఇంత చిన్న చూపా.. విశ్రాంతి భవనం కూలిపోయే పరిస్థితిలో ఉండి కోతులు, కుక్కలకు నిలయంగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన విశ్రాంతి భవనాన్ని నిర్మించాలి.

– తోట యాకయ్య, నెల్లికుదురు

ఇందిరమ్మ ఆశయానికి ప్రాణం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: అర్హులందరికీ ఇళ్లు ఇస్తూ ఇందిరమ్మ ఆశయానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణం పోస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మండలంలోని నడివాడ, గడ్డిగూడెం, గడ్డిగూడెం తండ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మురళీనాయక్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, పక్కా ఇంటితో ఓ పేదవాడి జీవితం మారుతుందన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన ఇబ్బంది లేదన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ రావు, నాయకులు మిట్టకంటి రామిరెడ్డి, ఎడ్ల రమేష్, రామగోని రాజుగౌడ్, ఎండీ.ఖలీల్, పోతురాజు రాజు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

మహబూబాబాద్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత తనదని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేశ్వర్, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ కుమార్, టీపీఓ సాయిరాం, మేనేజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే యాదవుల ఆత్మగౌరవ సభకు సంఘాలు, పార్టీలకు అతీతంగా హాజరై జయప్రదం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు డి.రాజారాం యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్ యాదవ్, తెలంగాణ యాదవ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్ పిలుపునిచ్చారు. యాదవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వేణు యాదవ్, ఎడ్ల రమేష్, శ్రీనివాస్, భాస్కర్, సోమన్న పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా మహిళలు పని చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జిల్లా మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధలతో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం మహిళలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిందేనన్నారు. మహిళలకు మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. ఝాన్సీరెడ్డి, రాధలు మాట్లాడుతూ.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితం అందించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పింగిళి ఉష, నాయకులు వెలుగు మహేశ్వరీ, మాలోతు సునీత, రేవతి, స్వాతి, శిరీష, ఉపేంద్ర, హరిత, అమల, స్వర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

డోర్నకల్: మండలంలోని జోగ్యాతండాతోపాటు పలు గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కాసం శేఖర్, ఆంగోత్ వెంకన్న, భాస్కర్ పాల్గొన్నారు.

పేదలకు ఇల్లు ఇవ్వడమే ధ్యేయం

దంతాలపల్లి: పేదలకు గూడు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మినేని సతీష్ అన్నారు. మండలంలోని దాట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం ఆయన ముగ్గు పోశారు. కార్యక్రమంలో యూత్ ప్రధాన కార్యదర్శి కాయిత శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షరీఫ్, బషీర్, పోలేపొంగు ఇద్దులు, చింత సంతోష్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

తొర్రూరు రూరల్: గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22నుంచి మానుకోటలో నిర్వహించనున్న జిల్లాస్థాయి మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు ఎద్దు ఐలయ్య, మండల కోశాధికారి మేకల మధు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని నాంచారీమడూరు గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

'రైతు భరోసా'కు దరఖాస్తు

పెద్దవంగర: రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వామి నాయక్ కోరారు. జూన్ 5, 2025 వరకు కొత్తగా పాస్ పుస్తకం పొందిన రైతులు పథకానికి అర్హులు అన్నారు. దరఖాస్తుకు ఈనెల 20(రేపటికి) చివరి తేదీగా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు.

సమస్యల పరిష్కారానికే 'పొలంబాట'


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ నవ్య

చిన్నగూడూరు: వ్యవసాయ పొలాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'విద్యుత్ శాఖ–పొలం బాట' కార్యక్రమం చేపడుతున్నట్లు చిన్నగూడూరు విద్యుత్ శాఖ ఏఈ నవ్య తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నగూడూరు సెక్షన్ పరిధిలోని చిన్నగూడూరు, పగిడిపల్లి, గుండంరాజుపల్లి గ్రామాల రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ మోటార్ల స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలుంటే సొంతంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ సిబ్బందికి లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ జహూర్ పాషా, విద్యుత్ సిబ్బంది క్రాంతి, నారాయణ, రైతులు మురళీధర్ రెడ్డి, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మెరుగైన వసతులు

డోర్నకల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని ఐసీడీఎస్ డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మి తెలిపారు. పాతడోర్నకల్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేఖాబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద, అన్నమ్మ పాల్గొన్నారు.

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలోని అంగన్‌వాడీ–2 కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ ఆధ్వర్యంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సులోచన పాల్గొన్నారు.

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని గిర్నితండా, భూక్య తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంతోష్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, కవిత, హెల్పర్ వెంకటలక్ష్మి, కవిత పాల్గొన్నారు.


డోర్నకల్: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

నెల్లికుదురు: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ రాందాస్ అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం మండలస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, జిల్లాస్థాయిలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న విజేతలకు తెలంగాణ పాఠశాలల్లో అడ్మిషన్ పొందుతారని తెలిపారు. జిల్లాస్థాయిలో ఈనెల 20 నుంచి 23 వరకు ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జీవన్ కుమార్, రవి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు ఐలయ్య, ప్రవీణ్, హిమాం, కొమురయ్య, శ్రీనివాస్, వనిత, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ భద్రత సాధ్యం


మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

తొర్రూరు: బీజేపీతోనే దేశ భద్రత సాధ్యమని వరంగల్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్, బీజేపీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. డివిజన్ కేంద్రంలో బుధవారం బీజేపీ సంకల్ప సభ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రదీప్‌రావు మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సబ్‌కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ మంత్రాన్ని సాకారం చేసేందుకు బీజేపీ కృషి చేస్తోందన్నారు. బీజేపీ పాలనలో దేశ వ్యాప్తంగా ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. దేశ భద్రత, రక్షణ, శత్రుదేశాలను నిలువరించడంలో ప్రధాని మోదీ సఫలీకృతమయ్యాడన్నారు. వికసిత్ భారత్ బీజేపీ పాలనతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేష్, రాష్ట్ర నాయకులు లేగా రామ్మోహన్‌రెడ్డి, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు రచ్చ కుమార్, రంగు రాములు, కొలుపుల శంకర్, పైండ్ల రాజేష్, రవిబాబు, నవీన్‌రెడ్డి, సాయిని ఝాన్సీ, సంపత్, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం


కిందకు వంగి ఉన్న విద్యుత్ స్తంభం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం పాంబండ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఓ 11కేవీ విద్యుత్ స్తంభం ఇటీవల వీచిన ఈదురు గాలులకు పూర్తిగా కిందకు వంగి ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ తీగల మీద ఆధారపడి స్తంభం ఉండడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని గిరిజన రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ క్షేత్రాల్లో కిందకు వంగి ఉన్న విద్యుత్ స్తంభాన్ని సరిచేసేలా చర్యలు చేపట్టాలని గిరిజన రైతులు కోరారు.

కర్రె విద్యుత్ స్తంభం


వేలాడుతున్న విద్యుత్ తీగలకు కట్టిన కర్ర

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలో విద్యుత్ లైన్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించునే నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతంపేట గ్రామంలోని ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో బీటీ రహదారి పక్కన విద్యుత్ లైన్ తీగలు కిందకు వేలాడుతుండటంతో గ్రామస్తులు విద్యుత్ పోల్స్ మధ్యలో కర్రను పాతి విద్యుత్ లైన్ తీగలను పైకి లాగారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కర్రను తొలగించి విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన రెవెన్యూ సదస్సులు

గూడూరు: భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలో చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిసినట్టు తహసీల్దార్ నాగభవాని, డీటీ కోమల తెలిపారు.

వైద్యుడికి సన్మానం

డోర్నకల్: డోర్నకల్ రైల్వే ఆసుపత్రి వైద్యాధికారి సునీల్‌నాయక్ ను మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంజియాదవ్, యుగేందర్‌యాదవ్, కరణ్‌సింగ్, నాగేషు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.4.78కోట్ల'రైతు భరోసా' నిధులు జమ

కొత్తగూడ: ఖరీఫ్ సీజన్‌లో బుధవారం వరకు రూ.4.78కోట్ల నిధులు కొత్తగూడ మండల రైతుల ఖాతాల్లో జమ అయినట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

చిన్నగూడూరు: రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ నాయకుడు రావుల ప్రమోద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వానాకాలం సాగుకు ఆసరాగా రైతుభరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడాన్ని హర్షం వ్యక్తం చేశారు.

బియ్యం అందజేత

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి కేసముద్రం విలేజిలో గుండెబోయిన నాగరాజు మృతి చెందాడు. ఈమేరకు పీసీసీ ఓబీసీ వర్కింగ్ అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్ సహకారంతో బాధిత కుటుంబానికి క్వింటా బియ్యంను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కత్తెరశాల శ్రీనివాస్, చిట్ల రవి, కీర్తి సురేందర్ పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలోగల యూపీఎస్‌లో 60మంది విద్యార్థులకు జూకంటి కుమారస్వామి తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా రూ.10వేల విలువైన నోట్ పుస్తకాలను బుధవారం అందజేశాడు. కార్యక్రమంలో ఎంఈఓ కాలేరు యాదగిరి, పంచాయతీ కార్యదర్శి రఘు, హెచ్ఎం బీరం జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజు, వాగ్య, ఫైజరుద్దీన్, శ్రీనివాస్, శ్రీలత, ముత్యం శ్రీను, రాహుల్ పాల్గొన్నారు.

అన్నదానం



గార్ల: శ్రీరామదూతస్వామి జన్మదినం సందర్భంగా బుధవారం గార్ల వర్తకసంఘం భవనంలో శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకుడు, అన్నదాత జితేందర్ అగర్వాల్, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ రావూరి వెంకట్రామయ్య, పుల్లఖండం రమేష్‌బాబు, వేణుగోపాల్‌రావ పాల్గొన్నారు

టై, బెల్టుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: తెలుగు సమితి అఫ్ నేబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ సమితి ఆధ్వర్యంలో మండలంలోని నడివాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏకరూప టీషర్టులు, టై బెల్టులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పోల ధనుంజయనాయుడు, స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామసహాయం శ్రీధర్ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం ఉప్పలయ్య, ఉపాధ్యాయుడు రమేష్, పంచాయతీ సెక్రెటరీ మామిళ్ల ఉమారాణి పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: గూడూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే సింహపురి రైలులో అక్రమంగా తీసుకువస్తున్న ఆరుబస్తాల నల్లబెల్లం బస్తాలను పట్టుకున్నామని మహబూబాబాద్ రైల్వే రక్షక దళం ఎస్సై సుభాని బుధవారం తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థిని మృతి

గంగారం: ఈతకు వెళ్లి నీటిగుంతలో పడి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని కాటినాగారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గంగారం మండలంలోని కాటినాగారం గ్రామానికి చెందిన మూతి శ్రావణి (12) గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. బుధవారం తన స్నేహితులతో కలిసి కోమట్లగూడెం గ్రామ శివారులోని పెద్ద చెరువులోకి ఈతకు వెళ్లింది. చెరువులోని నీటిగుంతలో పడి మునిగిపోయింది. అక్కడున్న వారు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రవి కుమార్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి


సమీక్షలో పాల్గొన్న అధికారులు

దంతాలపల్లి: వర్షాకాలంలో ప్రజలకు రాబోయే సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దారు సునీల్ కుమార్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజావైద్యశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో నిర్ణయించిన రోజుల్లో వైద్యశిబిరం నిర్వహించాలని గుర్తుచేశారు. అలాగే ఆస్పత్రి ఆవరణం పరిశుభ్రంగా ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు కవిత, రమ్య, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలను మూసివేయాలి



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని అనుమతిలేని బోగస్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను వెంటనే మూసివేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట బుధవారం లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల భూములను కబ్జా చేసి ఆ స్థలంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించారన్నారు. కార్యక్రమలో గిరిజనులు భూక్య శ్రీను, రవీందర్‌నాయక్, హరినాయక్, మల్సూర్‌నాయక్, మహేశ్వరి పాల్గొన్నారు.

సీసీ రోడ్లతో తండాల అభివృద్ధి



కురవి: సీసీ రోడ్లతో తండాలు అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నల్లెల్ల శివారు గాజా తండా జీపీ పరిధిలోని టేకుల తండాలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బండి ఉప్పలయ్య, ధర్మసోత్ స్వామి, ధర్మసోత్ శంకర్, బానోత్ చిరంజీవి, బానోత్ ధర్మ పాల్గొన్నారు.

నేడు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు

కురవి: మండల కేంద్రంలో కురవి, సీరోలు మండలాలకు చెందిన విద్యార్థులు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలో పాల్గొనాలని ఎంఈఓలు బాలాజీ, లచ్చిరాంనాయక్‌లు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రెండు మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు.

త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

నెల్లికుదురు: ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం మొదలుపెట్టి బిల్లులు పొందాలని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న కోరారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని వివిధ గ్రామాలల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ పద్మ, హౌసింగ్ ఏఈ అనిల్‌తో కలిసి పరిశీలించారు.

ప్రజలకు సేవలందిస్తా..


వివేక్

మహబూబాబాద్ అర్బన్: కిసాన్ పరివార్ సీఈఓ పదవీకి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజలకు నిరంతరం సేవలందిస్తానని డాక్టర్ వివేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ సమైక్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజల కోసం చేసే పోరాటంలో భాగంగా తనకు ఏది అడ్డు వచ్చిన రాజీనామా చేస్తానని, రాష్ట్ర వ్యాప్తగా డీఎస్ఎఫ్ఐ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పూర్తిస్థాయిలో మానుకోటలో ఉండి మానుకోట ప్రజలకు సేవలందిస్తామన్నారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

డోర్నకల్: డోర్నకల్ మండలం రావిగూడెం సమీపంలో ఈనెల 14 శనివారం అదృశ్యమైన ఉల్లి రంజిత్‌కుమార్ అలియాస్ రాకేష్ బుధవారం శవమై కనిపించాడు. మహబూబాబాద్‌కు చెందిన రాకేష్ ఐదు రోజుల క్రితం రావిగూడెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం సాయంత్రం బయటకు వెళ్లిన రాకేష్ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతుకుతుండగా గ్రామ సమీపంలోని సీతారామా ప్రాజెక్ట్ కాల్వ సమీపంలో రాకేష్ ద్విచక్రవాహనం, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. దీనిపై కేసు నమోదు చేసిన డోర్నకల్ పోలీసులు ద్విచక్ర వాహనం లభ్యమైన పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. బుధవారం సీఐ బి.రాజేష్ ఆధ్వర్యంలో సీతారామా ప్రాజెక్ట్ కాల్వ పరిసరాల్లో సుమారు 60మంది పోలీసుల బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా సమీపంలోని గుట్టపైన రాకేష్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.